సాక్షి
కామారెడ్డి
బుధవారం । 28 । మే । 2025



యంగ్ ఇండియా స్కూల్ మంజూరు
బాన్సువాడ నియోజకవర్గానికి యంగ్ ఇండియా స్కూల్ మంజూరయ్యిందని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.
- 8లో ▸



రోడ్డు ప్రమాదాల నివారణకు..
జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఎస్పీ రాజేశ్ చంద్ర పోలీసులకు సూచించారు.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
36.7 /23.8

వాతావరణం
ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

కాలభైరవుడి సేవలో హరీశ్‌రావు



రామారెడ్డి: మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు మంగళవారం ఇసన్నపల్లి(రామారెడ్డి)లోని శ్రీకాలభైరవ స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయానికి మొదటిసారి వచ్చిన ఆయనకు సిబ్బంది పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అర్చకులు, ఆలయ ఈవో ప్రభుగుప్తా తీర్థప్రసాదాలను అందించారు. హరీశ్‌రావు వెంట మాజీ ఎంపీపీ దశరథ్‌రెడ్డి, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ సతీశ్ గుప్తా, నాయకులు సత్యంరావు, పడిగెల శ్రీనివాస్ తదితరులున్నారు.

అటవీ భూముల ఆక్రమణకు చెక్



లింగంపేట: అటవీ భూముల ఆక్రమణకు అధికారులు చెక్ పెడుతున్నారు. అటవీ ప్రాంతంలో చెట్లను నరికిన ప్రాంతాల్లో పొక్లెయిన్‌లతో కందకాలు తవ్విస్తున్నారు. బోనాల్, మెంగారం శివారులోని అటవీ భూములు ఆక్రమణకు గురవుతున్న వైనంపై ఇటీవల 'సాక్షి'లో 'అటవీ భూములు అన్యాక్రాంతం' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ క్రమంలో అటవీ భూముల ఆక్రమణలను నిరోధించడానికి అటవీ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. అటవీ భూముల చుట్టూ కందకాలు తవ్విస్తున్నారు. రెండు రోజులుగా సెక్షన్ ఆఫీసర్ భాస్కర్, బీట్ ఆఫీసర్ పర్వీన్ పర్యవేక్షణలో కందకాల తవ్వకాలు కొనసాగుతున్నాయి. అటవీ ప్రాంతంలోకి ట్రాక్టర్లు వెళ్లకుండా రెండు మీటర్ల లోతు, రెండు మీటర్ల వెడల్పుతో కందకాలు తవ్విస్తున్నట్లు వారు తెలిపారు.

విద్యుత్ సమస్యలపై వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చు

కామారెడ్డి అర్బన్: వినియోగదారులు తమ ఫిర్యాదులను తెలియజేయడానికి వాట్సాప్ సేవలను అందుబాటులోకి తెచ్చినట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రావణ్‌కుమార్ తెలిపారు. వినియోగదారులు 79016 28348 నంబర్‌కు హాయ్ అని మెస్సేజ్ చేయగానే టీజీఎన్పీడీసీఎల్ కాల్ సెంటర్‌కు స్వాగతం అని రిప్లై వస్తుందని పేర్కొన్నారు. వినియోగదారులు ఆప్షన్లను ఎంచుకుని తమ ఫిర్యాదును నమోదు చేయవచ్చని వివరించారు. టోల్‌ఫ్రీ నంబర్ 1912 ద్వారా కూడా తమ సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

సామర్థ్యాలను పెంపొందించాలి

కామారెడ్డి రూరల్: విద్యార్థుల్లో సామర్థ్యాలను, విద్యా ప్రమాణాలను పెంపొందించడానికి ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాలు ఉపయోగపడతాయని డీఈవో రాజు పేర్కొన్నారు. జిల్లాలోని 15 మండలాల ప్రధానోపాధ్యాయులకు మంగళవారం దేవునిపల్లి జెడ్పీ హైస్కూల్‌లో ఐదు రోజుల శిక్షణను డీఈవో ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయులు ప్రతి ఉపాధ్యాయుడి బోధన తీరును పరిశీలించాలన్నారు. స్టాఫ్‌లో సమన్వయం సాధించాలి. అందరూ చక్కగా పనిచేసి విద్యాభివృద్ధికి పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ గంగాకిషన్, కోఆర్డినేటర్ వేణు శర్మ, ఆర్పీలు సాయిరెడ్డి, లోకేశ్వర్‌రెడ్డి, కృష్ణప్రసాద్, అంజల్‌రెడ్డి పాల్గొన్నారు.

'ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి'

కామారెడ్డి అర్బన్: జిల్లాలోని గిగ్, ప్లాట్ ఫారం వర్కర్స్ ఈ -శ్రమ్ పోర్టల్‌లో పేర్లను నమోదు చేసుకోవాలని జిల్లా సహాయ కార్మిక కమిషనర్ కోటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఫుడ్ డెలివరీ బాయ్స్, కొరియర్ సర్వీసెస్, హోమ్ సర్వీసెస్, ఏసీ టెక్నీషియన్లు, గ్రాఫిక్ డిజైనర్లు, వీడియో ఎడిటర్లు, రాపిడో, ఉబర్, ఓలా, జొమాటో, స్విగ్గి, అర్బన్ కంపెనీ, ఈకామ్ ఎక్స్‌ప్రెస్, లాజిస్టిక్స్, పోర్టల్ లాజిస్టిక్స్ వంటి సంస్థల్లో పనిచేసే కార్మికులు, ఈపీఎఫ్ లేనివారందరు పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ-శ్రమ్ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకున్న వారికి కార్మిక ఉపాధి మంత్రిత్వశాఖ గుర్తింపు కార్డుతో పాటు శాఖ అమలు చేసే సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు. ఇతర వివరాలకు హెల్ప్‌లైన్ నంబర్ 14434 లో సంప్రదించాలని సూచించారు.



■ సదాశివనగర్ మండలం తిర్మన్‌పల్లి గ్రామానికి చెందిన నీల స్వామి ఎనిమిదేళ్ల క్రితం సౌదీకి వెళ్లాడు. రెండేళ్లకోసారి ఇంటికి వచ్చి రెండు మూడు నెలలు ఉండి వెళుతుంటాడు. నాలుగు నెలల క్రితం అతడి ఆరోగ్యం దెబ్బతింది. అక్కడే వైద్యం చేయించుకున్నాడు. చికిత్స పొందుతూ చనిపోయాడు. ఆయన మృతదేహం ఇంటికి చేరడానికి దాదాపు మూడు నెలలు పట్టింది. ఆయనకు భార్య స్వప్న, ఇద్దరు కూతుళ్లున్నారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోయిన ఆ కుటుంబం ఇప్పుడు పుట్టెడు కష్టాల్లో ఉంది.

■ రామారెడ్డి మండలం గోకుల్ తండాకు చెందిన మాలోత్ భాస్కర్ అనే యువకుడు పది నెలల కింద దుబాయి వెళ్లాడు. అక్కడ తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. దీంతో అతడిని స్నేహితులు ఆస్పత్రికి తరలిస్తుండగా మరణించాడు. ఈ విషయమై సోమవారం కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. దీంతో మృతుడి కుటుంబం కన్నీరుమున్నీరవుతోంది. శవాన్ని అక్కడి నుంచి రప్పించడానికి కుటుంబ సభ్యులు, బంధువులు ప్రయత్నాలు మొదలుపెట్టారు.

ఉపాధి వేటలో చితికిపోతున్న బతుకులు

- బతుకుదెరువుకోసం ఎడారి దేశాలకు వలస
- వివిధ కారణాలతో నెలకో చావు వార్త
- రోడ్డున పడుతున్న కుటుంబాలు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : గల్ఫ్‌లో ఉపాధి.. అదో రంగుల కల. ఉన్న ఊళ్లో బతుకుదెరువు లేనివారికి ప్రత్యామ్నాయంగా కనిపించేది ప్రాంతం.. అక్కడికి వెళితే నాలుగు డబ్బులు సంపాదించగలమన్న నమ్మకం.. నూనూగు మీసాల వయసులోనే చాలా మంది గల్ఫ్ దేశాలకు వలస వెళుతుంటారు. కొన్ని కుటుంబాల్లో అయితే రెండు, మూడు తరాల వాళ్లూ గల్ఫ్ దేశాలకు వెళ్లారు. ఇప్పటికీ వలసలు కొనసాగుతున్నాయి. ఇటీవలి కాలంలో గ్రామీణ ప్రాంతాల నుంచి చాలామంది గల్ఫ్ బాట పడుతున్నారు. వీసాల కోసం కొందరు అప్పులు చేస్తుంటే, మరికొందరు ఉన్న భూమిని అమ్ముకుంటున్నారు. భార్య మెడలో ఉన్న బంగారాన్ని తాకట్టు పెట్టి వెళ్లే వారూ ఉన్నారు. కామారెడ్డి ప్రాంతంనుంచి ఐదు దశాబ్దాల కిందటే వలసలు మొదలైనా మూడు దశాబ్దాల నుంచి గల్ఫ్ వలసలు పెరిగాయి. వరుస కరువు కాటకాలతో పంటలు పండక వ్యవసాయాన్ని వదిలేసి వెళ్లిన వారే ఎక్కువ మంది ఉన్నారు. అయితే భార్య, పిల్లల్ని వదిలి గల్ఫ్ దేశాలకు వెళ్లిన వారు అక్కడ తీవ్రమైన మనోవేదనకు గురవుతున్నారు. కుటుంబ సభ్యులకు దూరంగా ఉండాల్సి రావడంతో మానసికంగా కుంగిపోతున్నారు. ఇటీవలి కాలంలో పలువురు గుండెపోటుతో ప్రాణాలు కోల్పోయారు. అలాగే రోడ్డు ప్రమాదాలు, ఇతర ప్రమాదాల్లోనూ పలువురు చనిపోతున్నారు. సరైన సంపాదన లేక, అప్పులు తీర్చే దారి కానరాక కొందరు ఆత్మహత్యలకూ పాల్పడుతున్నారు. ఇటీవలి కాలంలో గల్ఫ్ దేశాల నుంచి నెలకో చావు వార్త వస్తోంది. ఎడారి దేశంలో చనిపోయిన వ్యక్తి శవం రావడానికి ఒక్కోసారి రెండు మూడు నెలలు కూడా వేచిచూడాల్సిన పరిస్థితుల్లో వారి కుటుంబ సభ్యుల వేదన అంతాఇంతా కాదు.

ఉమ్మడి జిల్లా నుంచి..

ఉమ్మడి నిజామాబాద్ నుంచి గల్ఫ్ దేశాలకు వలసలు ఎక్కువగానే ఉంటాయి. ఎక్కువగా దుబాయి, ఒమన్, ఖతర్, సౌదీ అరేబియా, బహ్రెయిన్ వంటి దేశాలకు వలస వెళ్తున్నారు. తెలంగాణ ప్రాంతానికి చెందిన వారే 10 లక్షల మంది గల్ఫ్ దేశాల్లో పనిచేస్తుండగా.. అందులో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన వారు 1.50 లక్షల మంది ఉంటారు. కరీంనగర్ జిల్లాకు చెందిన వారు 4 లక్షల మంది వరకు ఉన్నట్లు అంచనా.

ఐదేళ్లలో యాభైమందికిపైగా మృతి

జిల్లాలో ప్రధానంగా కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజక వర్గాల్లోని మాచారెడ్డి, రామారెడ్డి, దోమకొండ, కామారెడ్డి, బీబీపేట, భిక్కనూరు, రాజంపేట, తాడ్వాయి, గాంధారి, లింగంపేట తదితర మండలాల నుంచి ఎక్కువ మంది గల్ఫ్ దేశాలకు వెళ్లారు. ఐదేళ్ల కాలంలో జిల్లాకు చెందిన యాభై మందికి పైగా ఆయా దేశాల్లో వివిధ కారణాలతో చనిపోయారు. ఇటీవలి కాలంలో గుండెపోటుతో చనిపోతున్న సంఘటనలు ఎక్కువగా ఉన్నాయి. నెలకో చావు వార్త వస్తుండడంతో గల్ఫ్ కుటుంబాల్లో ఆందోళన నెలకొంది. నాలుగు డబ్బులు సంపాదించడానికి వెళ్లిన వ్యక్తి శవపేటికల్లో ఇంటికి చేరుతుండడంతో ఆ కుటుంబాలకు తీరని వేదన మిగులుతోంది.

కారణాలెన్నో..

బతుకుదెరువు కోసం ఎన్నో ఆశలతో గల్ఫ్ బాటపట్టిన ఎందరి జీవితాల్లో అర్ధంతరంగా ఆరిపోతున్నాయి. ఎన్నో ఆశలతో లక్షలు ఖర్చు చేసి గల్ఫ్ దేశానికి వెళ్లినా అక్కడి కంపెనీలు సరైన వేతనాలివ్వక పోవడంతో వీసా కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం లేక పలువురు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. పనులకు వెళ్లే సమయంలో రోడ్డు దాటుతూ ప్రమాదాల్లో కొందరు.. పనిలో ఉండగా పెద్దపెద్ద భవనాలపై నుంచి పడిపోయి కొందరు చనిపోయారు. కుటుంబ సభ్యులకు దూరంగా ఉండాల్సి రావడంతో మానసికంగా నలిగిపోయి పలువురి గుండెలు ఆగిపోయాయి.

సాగుకు రైతును సన్నద్ధం చేయాలి



సీఎంతో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సంగ్వాన్, అదనపు కలెక్టర్లు విక్టర్, చందర్, సబ్ కలెక్టర్ కిరణ్మయి, వివిధ శాఖల అధికారులు

- నకిలీ విత్తనాలు అమ్మితే పీడీ యాక్ట్ నమోదు చేయాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

కామారెడ్డి క్రైం : వర్షాలు పడుతున్న నేపథ్యంలో ముందస్తు సాగుకు రైతులను సన్నద్ధం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. మంగళవారం ఆయన పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ, హౌసింగ్ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావులతో కలిసి హైదరాబాద్‌నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇందిరమ్మ ఇళ్లు, భూ భారతి, ధాన్యం కొనుగోలు, వ్యవసాయం తదితర అంశాలపై కలెక్టర్లతో సమీక్షించారు. రైస్ మిల్లులను కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించాలని, ఎక్కడైనా రైతులకు అన్యాయం చేయాలని మిల్లర్లు చూస్తే వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అకాల వర్షాల కారణంగా నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ. 10 వేల పరిహారం అందించేందుకు నివేదిక తయారు చేయాలన్నారు. వర్షాలు ముందుగా రావడంతో వ్యవసాయ శాఖ తన ప్రణాళికలలో మార్పులు చేసుకోవాలన్నారు. అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలన్నారు. నకిలీ విత్తనాలు అమ్మే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేయాలన్నారు.

3 నుంచి రెవెన్యూ సదస్సులు..

వచ్చేనెల 3 నుంచి 20 వ తేదీ వరకు అన్ని మండలాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని ముఖ్యమంత్రి సూచించారు. పైలట్ మండలాల్లో నిర్వహించిన భూభారతి సదస్సుల అనుభవాలను దృష్టిలో ఉంచుకొని మిగిలిన ప్రాంతాల్లో రెవెన్యూ సదస్సుల నిర్వహణకు కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం లబ్ధిదారులకు టోకెన్‌లు జారీ చేసి ఉచితంగా ఇసుక సరఫరా చేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ జిల్లా అధికారులతో మాట్లాడారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేసి, ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమాన్ని వేగవంతం చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో బాన్సువాడ సబ్‌కలెక్టర్ కిరణ్మయి, అదనపు కలెక్టర్లు విక్టర్, చందర్, ఆర్డీవోలు వీణ, ప్రభాకర్, పౌరసరఫరాలు, వ్యవసాయం, సహకార, మార్కెటింగ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సింగితంలోకి ఇన్‌ఫ్లో

నిజాంసాగర్: నిజాంసాగర్, మహమ్మద్‌నగర్ మండలాల్లో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. కుండపోతగా వర్షం పడడంతో ఒర్రెలు, వాగుల్లో నీటి ప్రవాహం మొదలయ్యింది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షానికి మహమ్మద్‌నగర్ మండలంలోని సింగితం రిజర్వాయర్‌లోకి వరద నీరు వచ్చి చేరుతోంది.



సింగితం రిజర్వాయర్‌లోకి వస్తున్న వరద నీరు

చివరి గింజా కొనుగోలు చేయాలి



తుజాల్‌పూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

బీబీపేట: రైతుల వద్దనున్న చివరి గింజ వరకు కొనుగోలు చేయాలని నిర్వాహకులకు కలెక్టర్ సంగ్వాన్ సూచించారు. మంగళవారం ఆయన బీబీపేట మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. తుజాల్‌పూర్‌లోని కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని ఫర్టిలైజర్, పెస్టిసైడ్స్, విత్తనాల దుకాణాన్ని తనిఖీ చేశారు. ప్రభుత్వం అనుమతించిన విత్తనాలు, ఎరువులనే అమ్మాలన్నారు. బీబీపేట్‌లో స్వరూప ఇంటి నిర్మాణానికి ముగ్గు పోసి, మంజూరు పత్రాన్ని అందించారు. ఎంపీడీవో కార్యాలయంలో చేపట్టిన మోడల్ ఇందిరమ్మ ఇంటిని పరిశీలించారు. బీబీపేట పీహెచ్‌సీని పరిశీలించి రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని మెడికల్ ఆఫీసర్‌కు సూచించారు. పలువురు సిబ్బంది హాజరు రిజిష్టర్లో సంతకాలు చేయకపోవడంతో విధుల్లో లేనివారి వివరాలు తెలుసుకున్నారు. సూపర్‌వైజర్ సత్యానంద్ అనధికార సెలవులో ఉండడాన్ని గమనించి అతడిని సస్పెండ్ చేయాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. అదనపు డీఎంహెచ్‌వో, ప్రోగ్రాం ఆఫీసర్స్ విధుల్లో లేకపోవడంతో వారికి నోటీసులు జారీచేయాలని సూచించారు. ఖాళీ స్థలంలోని చెత్తను తొలగించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని మెడికల్ ఆఫీసర్‌ను ఆదేశించారు. ఆయన వెంట డీసీవో రామ్మోహన్, డీఏవో తిరుమల ప్రసాద్, హౌసింగ్ పీడీ విజయపాల్‌రెడ్డి, డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, మెడికల్ ఆఫీసర్ భానుప్రియ, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో పూర్ణచందర్ తదితరులున్నారు.

వేడుకలను ఘనంగా నిర్వహించాలి

- రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన శకటాలను ప్రదర్శించాలి
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం : రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వచ్చేనెల 2 న జిల్లాకేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లాలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ముఖ్య అతిథి సందేశం సిద్ధం చేయాలని సూచించారు. అభివృద్ధి కార్యక్రమాలను తెలిపే విధంగా శకటాల ప్రదర్శన, స్టాళ్లను ఏర్పాటు చేయాలన్నారు. వివిధ సంక్షేమ శాఖల ద్వారా లబ్ధిదారులకు మంజూరు ఉత్తర్వులు అందించడానికి ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు విక్టర్, చందర్, ఆర్డీవో వీణ తదితరులు పాల్గొన్నారు.

టీబీ వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి

ఈ ఏడాది చివరికల్లా టీబీ వ్యాధి నిర్మూలన జరిగేలా కృషి చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. సంబంధిత శాఖల అధికారులతో మంగళవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పారిశ్రామిక వాడలు, రైస్‌మిల్లులు, సిమెంట్ దుకాణాల్లో పనిచేసే కార్మికులు, 60 ఏళ్ల పైబడిన వారందరికీ వైద్య పరీక్షలు చేయించాలన్నారు. టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వే చేపట్టి వ్యాధిగ్రస్తులను గుర్తించాలని సూచించారు. టీబీ ఉన్న వారికి ఉచితంగా మందులు, పౌష్టికాహారం తీసుకునేందుకు సహకారంగా నెలకు రూ.500 ఇవ్వనున్నట్లు తెలిపారు. త్వరగా ఇంటింటి సర్వే ప్రారంభించాలన్నారు. టీబీ వ్యాధిని నిర్ధారించే పరీక్షా కేంద్రాలు కామారెడ్డి, ఎల్లారెడి, బాన్సువాడ, బిచ్కుంద ఆస్పత్రుల్లో ఉన్నాయని తెలిపారు. సమావేశంలో డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, టీబీ ప్రోగ్రాం అధికారి రాధికరాణి, ఎన్‌సీడీ పీవో శిరీష, డిప్యూటీ డీఎంహెచ్‌వో విద్య, పీఆర్, మున్సిపల్, కార్మిక, ఐకేపీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

యూనిఫాంలు సిద్ధం చేయాలి



దోమకొండలో యూనిఫాంల స్టిచ్చింగ్ వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

దోమకొండ : పాఠశాలల పునఃప్రారంభానికి ముందే విద్యార్థులకు అందించేందుకు యూనిఫాంలను సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. మంగళవారం దోమకొండలోని యూనిఫాం కుట్టు మిషన్ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. ఇప్పటి వరకు సిద్ధం చేసిన యూనిఫామ్‌ల వివరాలు తెలుసుకున్నారు. సకాలంలో స్టిచ్చింగ్ పూర్తి చేయాలని సూచించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో చేపట్టిన ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణాన్ని పరిశీలించారు. నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యాలయ ఆవరణలోని బోర్‌వెల్ రీచార్జి స్ట్రక్చర్స్‌ను, ఇందిర మహిళా శక్తి క్యాంటీన్‌ను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమాల్లో డీఆర్‌డీవో సురేందర్, జిల్లా ఉద్యాన అధికారి జ్యోతి, డీపీఎం రమేష్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఐకేపీ ఎంపీఎం రాజు తదితరులు పాల్గొన్నారు.

సాగర్ భూముల పరిరక్షణకు పోరుబాట

- మండల కేంద్రంలో ధర్నా చేసిన కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు
- తహసీల్దార్‌కు వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నేతలు



నిజాంసాగర్‌లో ధర్నా చేస్తున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు

నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రాజెక్టు భూములను పరిరక్షించాలని మంగళవారం మండల కేంద్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు ఆందోళనకు దిగారు. బస్టాండ్ వద్ద రాస్తారోకో చేశారు. నిజాంసాగర్ భూములను ఇతర ప్రాజెక్టుల ముంపు బాధితులకు కేటాయిస్తుండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సిద్దాపూర్ రిజర్వాయర్ నిర్మాణంలో భూములు కోల్పోతున్నవారికి నిజాంసాగర్ భూముల్లో పునరావాసం కల్పించాలన్న నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం బస్టాండ్ నుంచి తహసీల్ కార్యాలయం వరకు ర్యాలీ తీశారు. నిజాంసాగర్ భూములను కాపాడాలంటూ తహసీల్దార్ భిక్షపతికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు మల్లికార్జున్, రవీందర్‌రెడ్డి, దుర్గారెడ్డి, గైని విఠల్, నర్సింహారెడ్డి, రమేష్‌యాదవ్, లోక్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఒకే దేశం–ఒకే ఎన్నికతో ఎన్నో ప్రయోజనాలు

కామారెడ్డి అర్బన్: దేశంలో శాసనసభ, పార్లమెంట్ ఎన్నికలను ఒకేసారి నిర్వహించడం ద్వారా ఎన్నో ప్రయోజనాలుంటాయని బీజేపీ నేత, 'ఒకే దేశం–ఒకే ఎన్నిక' రాష్ట్ర ఇన్‌చార్జి అవనికాంత్ పాండే పేర్కొన్నారు. మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో కామారెడ్డి పీజేఆర్ స్ఫూర్తి డిగ్రీ కళాశాలలో జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు అధ్యక్షతన మేధావుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాండే మాట్లాడుతూ ఒకే దేశం.. ఒకే ఎన్నికపై వివిధ వర్గాల వారి అభిప్రాయాలు తెలుసుకుంటున్నామన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎన్నికలు దేశాభివృద్ధి అడ్డుకావద్దు అనేది బీజేపీ భావన అన్నారు. కార్యక్రమంలో 'ఒకే దేశం.. ఒకే ఎన్నిక' జిల్లా ఇన్‌చార్జి లింగారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రంజిత్‌మోహన్, జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్‌రావు, నాయకులు లక్ష్మారెడ్డి, ఎం.శ్రీకాంత్, వేణు, సంతోష్, రవీందర్, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ నేత అవనికాంత్ పాండే

క్లుప్తంగా

ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన ఎస్పీ



ఎల్లారెడ్డి:ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన ఎస్పీ రాజేశ్ చంద్ర మంగళవారం తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రంలోని తరగతి గదులను ఆయన పరిశీలించారు. పరీక్షా కేంద్రం వద్ద పోలీసుల విధుల నిర్వహణ తీరును పరిశీలించారు. కార్యక్రమంలో కళాశాల చీఫ్ సూపరింటెండెంట్ నిజాం తదితరులున్నారు.

ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి



బాన్సువాడ రూరల్: అన్ని అర్హతలు ఉన్నా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాలేదని, ఇళ్లు కేటాయించి న్యాయం చేయాలని కొత్తాబాది గ్రామానికి చెందిన పలువురు దరఖాస్తుదారులు కోరారు. పాత పెంకుటిళ్లు, పూరిగుడిసెలు కూలిపోయాయని తమకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తే వెంటనే పనులు ప్రారంభించుకుంటామన్నారు.ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో తమకు తీవ్ర అన్యాయం జరిగిందని, త్వరలో జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు అందజేస్తామని షావలీ, లింగయ్య, ధరావత్ గంగారాం, మంగ్యా, విజయ్‌కుమార్, బీబీలు తెలిపారు.

భవనం నిర్మించారు.. ప్రహరీ వదిలేశారు



బాన్సువాడ : బీర్కూర్ మండల కేంద్రంలో మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలుర గురుకుల పాఠశాల భవనం నిర్మించారు. ప్రహరీ నిర్మాణం వదిలేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 2023లో రూ. 6.70 కోట్ల వ్యయంతో బీర్కూర్‌లో బీసీ బాలుర గురుకుల పాఠశాలను నిర్మించారు. ఈ పాఠశాలలో సుమారు 560 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అన్ని వసతులతో భవనం నిర్మించారు. పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో పశువులు, పందులు పాఠశాల ఆవరణలోకి వచ్చి స్వైర్య విహారం చేస్తున్నాయి. వర్షాకాలంలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి ప్రహరీ నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

మైనారిటీ స్కూల్‌లో అన్ని వసతులు

బిచ్కుంద(జుక్కల్) : మండల కేంద్రంలోని మైనారిటీ బాలుర స్కూల్‌లో అన్ని సౌకర్యాలున్నాయని, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో బోధన కొనసాగుతుందని ప్రిన్సిపాల్ సునీతా భండారి అన్నారు. మంగళవారం విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి మైనారిటీ స్కూల్‌లో చేర్పించాలని కోరారు. మైనారిటీలకు 5వ తరగతిలో 37 సీట్లు,6లో 5సీట్లు,ఎస్సీ, ఓసీల సీట్లు 2 ఖాళీ ఉన్నాయి. అలాగే 8వ తరగతిలో 9సీట్లు, 9వ తరగతిలో 22 సీట్లు, 10 వ తరగతిలో 35 సీట్లు మైనారిటీలకు, ఎస్సీ 4, ఓసీ 1 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈఅవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

యంగ్ ఇండియా స్కూల్ మంజూరు

- బాన్సువాడ నియోజకవర్గం సోంపూర్ శివారులో స్థలం ఎంపిక
- వివిధ శాఖల అధికారులతో సమీక్షలో పోచారం శ్రీనివాస్‌రెడ్డి



సమీక్షలో మాట్లాడుతున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ బాన్సువాడ నియోజకవర్గానికి మంజూరైనట్లు ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన హైదరాబాద్‌లోని తన నివాసంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో వివరాలను వెల్లడించారు. సుమారు రెండు వందల కోట్లతో నిర్మించనున్న స్కూల్ కోసం పాతంగల్ మండలం పీఎస్ఆర్ నగర్ గ్రామం సోంపూర్ శివారులో స్థలాన్ని ఎంపిక చేశామన్నారు. ప్రభుత్వం ద్వారా టెండర్లు ఖరారు కాగానే పనులు పూర్తిచేయిస్తామన్నారు. బాన్సువాడ నియోజకవర్గ ప్రజలకు, ఈప్రాంత విద్యార్థులకు అమూల్యమైన వరం అందించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

సిద్దాపూర్ రిజర్వాయర్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

బాన్సువాడ నియోజక వర్గంలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతి, రానున్న వానాకాలంలో రైతులకు అందుబాటులో ఉంచాల్సిన విత్తనాలు, ఎరువులపై మంగళవారం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో రాష్ట్ర వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి రాష్ట్ర ఉన్నతస్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్ననేపథ్యంలో రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనర్ గోపితో పలు అంశాలపై చర్చించారు. పచ్చిరొట్ట విత్తనాలతో పాటు రైతాంగానికి సరిపడా ఎరువులు అందుబాటులో ఉంచాలని ఎరువుల కొరత రాకుండా చూడాలని సూచించారు. అలాగే బాన్సువాడలో నూతనంగా నిర్మించిన నర్సింగ్ కళాశాల మిగులు పనులు త్వరగా పూర్తిచేసి ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలని ఆర్అండ్‌బీ సీఈ రాజేశ్వర్‌కు సూచించారు. వ్యవసాయ ఆధారితమైన నియోజకవర్గంలో సాగునీరు అందించేందుకు చేపడుతన్న సిద్దాపూర్ రిజర్వాయర్ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని ఇరిగేషన్ సీఈ శ్రీనివాస్‌ను ఆదేశించారు. సుమారు రూ.258కోట్లతో ఒక టీఎంసీ సామర్థ్యంతో నిర్మించే సిద్దాపూర్ రిజర్వాయర్‌తో 14వేల ఎకరాలకు పుష్కలంగా సాగునీరు అందుతుందన్నారు. ఈకార్యక్రమంలో సంబంధిత శాఖ అధికారులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం ఇళ్లు నిర్మించుకోవాలి



వదల్‌పర్తిలో లబ్ధిదారుకు మంజూరుపత్రాన్ని అందజేస్తున్న తహసీల్దార్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వ కొలతలకు అనుగుణంగా, నిబంధనల మేరకు నిర్మించుకోవాలని నాగిరెడ్డిపేట తహసీల్దార్ శ్రీనివాస్‌రావు సూచించారు. నాగిరెడ్డిపేట మండలంలోని వదల్‌పర్తిలో మంగళవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు మార్కింగ్ ఇచ్చి లబ్ధిదారులకు మంజూరుపత్రాలను అందజేశారు.కార్యక్రమంలో మాల్తుమ్మెద సొసైటీ మాజీచైర్మన్ రాంచందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అజీమోద్దీన్, కాంగ్రెస్ గ్రామకమిటీ అధ్యక్షుడు యాదగిరి పాల్గొన్నారు.

లింగంపేట(ఎల్లారెడ్డి): ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని లబ్ధిదారులకు ఎంపీవో మలహరి సూచించారు. మంగళవారం ఆయన మండలంలోని నల్లమడుగు గ్రామంలో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులు పరిశీలించారు. అనంతరం గ్రామ శివారులోని కంపోస్టు షెడ్డును పరిశీలించారు. తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి కంపోస్టు ఎరువు తయారు చేయాలని కార్యదర్శికి సూచించారు. ఎరువులకు పంట చేనులకు తరలించాలని సూచించారు. అలాగే నర్సరీ, పల్లె ప్రకృతి వనం, వైకుంఠధామం పరిశీలించారు. పిచ్చి మొక్కలను తొలగించాలని సూచించారు. కార్యదర్శి ఉన్నారు.



హజ్గుల్‌లో ఇందిరమ్మ ఇంటిని పరిశీలిస్తున్న అధికారులు

ఇందిరమ్మ ఇళ్లు పరిశీలించిన ప్రత్యేక అధికారి

బిచ్కుంద(జుక్కల్) : ఇందిరమ్మ ఇళ్లు కట్టుకోవడానికి లబ్ధిదారులు ముందుకు రావాలని మండల ప్రత్యేక అధికారి మైన్స్ పీడీ నగేశ్ అన్నారు. మంగళవారం బిచ్కుంద, హజ్గుల్, పెద్దదేవాడ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు, పల్లె ప్రకృతి వనంను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె ప్రకృతి వనంలో మొక్కలు ఎండిపోకుండా చూడాల్సిన బాధ్యత జీపీ కార్యదర్శిపై ఉందన్నారు. ఆయన వెంట ఎంపీవో కృష్ణ ఉన్నారు.

బీఆర్ఎస్ నేతల ముందస్తు అరెస్ట్



అరెస్టయిన బీఆర్ఎస్ నేతలు

భిక్కనూరు: పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క నిర్మల్ జిల్లా పర్యటన నేపథ్యంలో పలువురు నేతలను పోలీసులు ముందస్తుగా మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. పెండింగ్ బిల్లులను చెల్లించాలన్న డిమాండ్‌తో మంత్రిని అడ్డుకునే అవకాశాలు ఉన్నాయన్న సమాచారంతో పలువురిని ముందస్తుగా అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిలో సిద్ధరామేశ్వర్‌నగర్ మాజీ సర్పంచ్ జనగామ శ్రీనివాస్‌తోపాటు గుర్జకుంట, పెద్దమల్లారెడ్డిలకు చెందిన బీఆర్ఎస్ నేతలు కందడి రమేశ్‌రెడ్డి, సత్తూరి రాజలింగం ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ సర్పంచ్‌లకు పెండింగ్ బిల్లులను చెల్లిస్తామని ప్రభుత్వం ఇటీవల ప్రకటించిందన్నారు. ఇప్పటికీ బిల్లులు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరగా బిల్లులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే



గడ్కరీకి జ్ఞాపికను అందజేస్తున్న ఎమ్మెల్యే కాటిపల్లి

కామారెడ్డి అర్బన్ : బీజేపీ నాయకుడు, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ జన్మదినం సందర్భంగా కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణ రెడ్డి మంగళవారం మహారాష్ట్ర నాగ్‌పూర్‌లోని నితిన్ గడ్కరీ నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీవేంకటేశ్వరస్వామి నిలువెత్తు చిత్ర పటం, ప్రసాదాన్ని మంత్రి గడ్కరీ అందజేశారు. ఎమ్మెల్యేతో పాటు జిల్లా బీజేపీ నాయకులున్నారని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు.

మాజీ సర్పంచుల ముందస్తు అరెస్టు



లింగంపేట(ఎల్లారెడ్డి): మాజీ సర్పంచుల జేఏసీ ఫోరం ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వానికి వినతిపత్రం ఇవ్వడానికి వెళ్తున్న మాజీ సర్పంచులను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు మండల సర్పంచుల ఫోరం ప్రధాన కార్యదర్శి అనిల్‌రెడ్డి తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని ప్రభుత్వానికి వినతిపత్రం అందజేయడానికి వెళ్తుంటే అడ్డుకోవడం సరికాదన్నారు. ప్రభుత్వం సర్పంచులకు పెండింగ్ బిల్లులు రూ. 153 కోట్లు విడుదల చేశామని చెప్పుకుంటుందన్నారు. కేవలం కాంట్రాక్టర్లకు ఎస్‌డీఎఫ్ బిల్లులు విడుదల చేసి సర్పంచులకు పెండింగ్ బిల్లులు ఇచ్చామని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు ఉన్నారు.

అటవీ భూమి ఆక్రమణ

- గాంధారి బీట్‌లో సాగుకు సిద్ధం చేస్తున్న గిరిజనులు
- ఇష్టానుసారంగా చెట్ల కొట్టివేత



గాంధారిశివారులో ఆక్రమణకు గురైన అటవీ భూమి

గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని అటవీ భూమి ఆక్రమణలకు గురవుతోంది. గాంధారి ఫారెస్టు రేంజ్ పరిధిలో 37 వేల ఎకరాల అటవీ భూమి ఉంది. ప్రభుత్వం మొదటి విడతలో 2008లో 900 ఎకరాలు, రెండో విడత 2020 లో 4,500 ఎకరాలను గిరిజన రైతులకు ఆర్వోఎఫ్ఆర్ పట్టాపాస్ బుక్కులు ఇచ్చింది. దీన్ని ఆసరాగా తీసుకున్న గిరిజన రైతులు ఇష్టానుసారంగా చెట్లను కొట్టివేస్తూ అటవీ భూమిని ఆక్రమించి సాగు చేస్తున్నారు. మండల కేంద్రానికి కేవలం కిలోమీటరు దూరంలో గాంధారి బీట్‌లో చుట్టూ పక్కల తండాల రైతులు గుట్టలన్నీ చదును చేసి సాగు చేస్తున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలనిస్థానిక రైతులు కోరుతున్నారు. ఈ విషయమై గాంధారి ఎఫ్ఆర్వో హేమచందనను సంప్రదించగా కొన్నేళ్లుగా అటవీ భూమి ఆక్రమణనకు గురైంది. తాను వచ్చినప్పటి నుంచి ఎటువంటి ఆక్రమణలు జరుగడం లేదు. కొన్ని సెక్షన్‌లలో చెట్లు లేవు, చిన్న పొదలు మాత్రమే ఉన్నాయి. అటవీ భూముల ఆక్రమణలు జరుగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

ఎస్పీ రాజేశ్ చంద్ర



పెద్దకొడప్‌గల్ పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ రాజేశ్ చంద్ర

పెద్దకొడప్‌గల్(జుక్కల్): జాతీయ రహదారిపై ప్రమాదాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీ రాజేశ్ చంద్ర ఆదేశించారు. పెద్దకొడప్‌గల్ పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి, సిబ్బందితో మాట్లాడారు. గతేడాది జిల్లా వ్యాప్తంగా 760 దొంగతనాలు జరిగాయని, వచ్చే ఏడాదిలో చోరీలు జరగకుండా చూస్తామన్నారు. 150 మేజర్ చోరీ కేసుల్లో 82 పరిష్కరించామన్నారు. 161 జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు హైవే అథారిటీ వారితో మాట్లాడి త్వరలో స్పీడ్ గన్స్ ఏర్పాటు చేయిస్తామని అన్నారు. చౌరస్తాల వద్ద వాహనాల వేగం తగ్గించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ కాకుండా పెట్రోలింగ్ పెంచడంతో పాటు విద్యుత్ శాఖ అధికారుల సహాయంతో గస్తీ ముమ్మరం చేస్తామన్నారు. కమ్యూనిటీ కాంటాక్ట్ ద్వారా సీసీ టీవీల ప్రాముఖ్యత, డయల్ 100 వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రమాదాల నివారణకు నిత్యం డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు చేయాలన్నారు. డీఎస్పీ విఠల్ రెడ్డి, సీఐ నరేశ్, ఎస్సై మహేందర్ ఉన్నారు.

నీళ్ల ట్యాంకుల వద్ద పిచ్చి మొక్కలు తొలగించాలి





నల్ల పోచమ్మ ఆలయం ట్యాంకు వద్ద పెరిగిన పిచ్చి మొక్కలు , కాలనీవాసులు చంపిన పాము

కామారెడ్డి అర్బన్: పట్టణ పరిధిలోని కాకతీయ నగర్, దేవునిపల్లి నల్లపోచమ్మ మిషన్ భగీరథ నీళ్ల ట్యాంకుల వద్ద పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. దీంతో విష పురుగులు, తేళ్లు, పాములు సంచరించడంతో కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. సోమవారం కాకతీయనగర్ నీళ్ల ట్యాంక్ వద్ద స్థానికులు ఓ పామును చంపేశారు. కాగా ట్యాంక్ నుంచి నీళ్లు వదలడానికి ఎంతో భయపడాల్సి వస్తుందని వాటర్ మెన్ మీసాల రవి వాపోయారు. ట్యాంకుల వద్ద పిచ్చిమొక్కలు తొలగించడంతో పాటు మొరం పోసి చదును చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.



సాగుకు సన్నద్ధం

బాన్సువాడ రూరల్: మండలంలోని నిజాంసాగర్ ఆయకట్టు కింద బోరుబావులు ఉన్న రైతులు ఈసారి వర్షాకాలం పంట ముందస్తుసాగుకు సన్నద్ధం అవుతున్నారు. ఇప్పటికే పొలాలను వేసవి దుక్కిదున్ని ఉంచిన రైతులు నారుమడులు సిద్ధం చేస్తున్నారు. తొలకరికి ముందే వర్షాలు కురవడం, ఈసారి నైరుతి రుతుపవనాలు ముందస్తుగా వస్తాయనే సమాచారం మేరకు నాట్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. మండలంలోని కొయ్యగుట్ట, బోర్లం, జక్కల్ దానితండా, ఇబ్రాహింపేట్, పోచారం, రాంపూర్ గ్రామాల రైతులు వర్షాకాలం ముందస్తు పంటల సాగు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

అ'పూర్వ' సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2000–2001 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు మంగళవారం ఓ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా చదువు నేర్పిన గురువులను సన్మానించారు. పాతికేళ్ల తర్వాత అందరూ ఒకే వేదికపై కలువడంపై ఆనందం వ్యక్తం చేశారు.

క్రైం కార్నర్

కారు ఢీకొని వృద్ధురాలు మృతి

మాక్లూర్: అమ్రాద్‌లో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి చెందినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. ఆ ర్మూర్ మండలం మచ్చర్ల గ్రామానికి చెందిన జీవమ్మ(78) కొంతకాలంగా అమ్రాద్‌లోని తన కుమార్తె వద్ద ఉంటుంది. మంగళవారం ఉదయం నడవలేని స్థితిలో ఉన్న జీవమ్మ దేకుతూ రోడ్డు దాటుతుండగా కారు ఢీకొట్టింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి మనుమడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి..

భిక్కనూరు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. మెదక్ జిల్లా రామాయంపేట్ గ్రామానికి చెందిన మహ్మద్ అన్వర్ (46) భిక్కనూరు గ్రామంలో సైకిల్ టెక్స్ పనిచేస్తుంటాడు. సోమవారం రాత్రి పనిముగించుకున్న అన్వర్.. వేద విహార్ వెంచర్‌లో ఉండే తమ్ముడు ఫాజిల్ అహ్మద్ ఇంటికి సైకిల్‌పై వెళుతుండగా లారీ ఢీకొట్టింది. క్షతగాత్రుడిని కామారెడ్డి ఆస్పత్రికి తరలించి, మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తీసుకెళుతుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ వివాహిత..

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని మర్కల్ గ్రామానికి చెందిన వివాహిత చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై రంజిత్ తెలిపారు. మర్కల్‌లోని సింపల్లి సాయవ్వ(42) ఐదేళ్లుగా నడుము నొప్పితో బాధపడుతోంది. నెల రోజుల క్రితం ద్విచక్రవాహనంపై నుంచి పడడంతో చేయి విరిగి మంచం పట్టింది. రోజురోజుకూ ఆరోగ్యం క్షీణిస్తుండడంతో జీవితంపై విరక్తి చెంది ఈ నెల 24న ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగింది. భర్త మల్లయ్య గమనించి వెంటనే కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు ఎల్లారెడ్డిపేట ఆస్పత్రికి, అక్కడి నుంచి ఈ నెల 25న నిజామాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపిన ఐదుగురికి జైలు

ఖలీల్‌వాడి: నిజామాబాద్ డివిజన్‌లో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డ ఐదుగురికి కోర్టు జైలు శిక్ష విధించినట్లు ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి తెలిపారు. సీపీ సాయి చైతన్య ఆదేశాల మేరకు డివిజన్‌లోని అన్ని పీఎస్‌ల పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించగా 31 మంది పట్టుబడ్డారని పేర్కొన్నారు. మార్నింగ్ కోర్టులో మంగళవారం హాజరుపర్చగా ఇద్దరికి రెండు రోజులు, ఒకరికి మూడు రోజులు, ఇద్దరికి నాలుగు రోజుల శిక్ష విధిస్తూ స్పెషల్ జ్యుడిషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జహాన్ బేగం తీర్పునిచ్చారు. మిగతా 26 మందికి జరిమానా విధించారు.


అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య



ధర్మరాజు(ఫైల్)

డిచ్‌పల్లి: మండలంలోని డిచ్‌పల్లి ఖిల్లా గ్రామానికి చెందిన ఎర్ర ధర్మరాజు (34) మంగళవారం ఉదయం చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఇన్‌చార్జి ఎస్సై సుహాసిని తెలిపారు. కొద్దిరోజులుగా ధర్మరాజు అప్పులతో బాధపడుతున్నాడు. ఇటీవల ఆయన పెద్ద కూతురు అనారోగ్యం బారినపడింది. దీంతో మనస్తాపానికి గురైన ధర్మరాజు ఉదయం తన పొలంలోని చెట్టు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి ఎర్రబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్సై సుహాసిని తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత



బిచ్కుంద(జుక్కల్): మండలంలోని పుల్కల్, హజ్గుల్ సమీపంలో మంజీర నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను మంగళవారం రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నారనే సమాచారం మేరకు ఉదయం 6 గంటలకు పట్టుకున్నట్లు తహసీల్దార్ వేణుగోపాల్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జరిమానా విధిస్తామన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ కాయిల్స్ చోరీ

వర్ని: మోస్రా మండలం గోవూర్ శివారులో మూడు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల కాయిల్స్, ఆయిల్‌ను దుండగులు చోరీ చేశారు. మంగళవారం తెల్లవారుజామున సుమారు రెండు గంటల ప్రాంతంలో చోరీ జరిగినట్లు స్థానిక రైతులు తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించామన్నారు.

మహిళ దారుణ హత్య

- అత్యాచారం చేసి అంతమొందించినట్లు అనుమానం



మృతదేహం వద్ద ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్ సిబ్బంది




సుమలత (ఫైల్)

నందిపేట్(ఆర్మూర్): నిర్మానుష్య ప్రాంతంలో మహిళను హత్య చేసిన ఘటన నందిపేట మండలంలోని అయిలాపూర్ గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నందిపేట మండలంలోని శాపూర్ గ్రామానికి చెందిన సాదా సుమలత (42) 20 సంవత్సరాల క్రితం భర్త చనిపోవడంతో కూలీ పని చేసుకుంటూ తన కుమారుడితో కలిసి జీవిస్తుంది. సోమవారం మధ్యాహ్నం నందిపేట మండలంలోని సీహెచ్ కొండూర్ గ్రామంలో బంధువుల ఇంట్లో తొట్లె ఫంక్షన్‌కు వెళ్లిన తర్వాత అక్కడి నుంచి నందిపేట వారాంతపు సంతకు వెళ్లి కూరగాయలు తీసుకొని వస్తానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరింది. రాత్రి అయినా సుమలత ఇంటికి రాకపోవడంతో కొడుకు సాదా సంజయ్, బంధువులు కలిసి చుట్టు పక్కల వెతికారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం ఉదయం అయిలాపూర్ శివారులోని గుత్ప లిఫ్ట్ కాలువ పక్కన పొలం పనుల నిమిత్తం ఎర్రటి రవి వెళ్లగా బండరాళ్ల వద్ద గుర్తు తెలియని మహిళ మృతదేహం కనిపించింది. పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి వెళ్లి సాదా సుమలతగా గుర్తించారు.

అత్యాచారం చేసి..

సాదా సుమలతను తెలిసిన వ్యక్తులే నిర్మానుష్య ప్రదేశానికి తీసుకువచ్చి మద్యం సేవించిన అనంతరం అత్యాచారం జరిపి హత్య చేసి ఉంటారని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఘటనా స్థలానికి ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్ రెడ్డి, క్లూస్ టీం బృందం చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహం పక్కన మద్యం బాటిల్‌తోపాటు గ్లాసులు, వాటర్ బాటిల్ ఉన్నాయి. ఉరి వేసి చంపినట్లు మృతురాలి మెడకు గాట్లు ఏర్పడ్డాయి. పక్కనే వైరు తాడు సైతం పడేసి ఉంది. డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టగా.. అది నందిపేటలోని వివేకానంద చౌరస్తా వద్దకు వచ్చి ఆగిపోయింది. మృతురాలి కొడుకు సంజయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

భూ తగాదాలో మహిళ..



జాదవ్ లక్ష్మీబాయి మృతదేహం

నిజాంసాగర్(జుక్కల్): భూ తగాదాలో ఓ మహిళ దారుణ హత్యకు గురైన ఘటన జుక్కల్ మండలం హంగర్గ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై భువనేశ్వర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన అన్నదమ్ములు జాదవ్‌రావ్ సాబ్ పటేల్, పండిత్‌రావు మధ్య కొన్నిరోజులుగా భూ వివాదాలు కొనసాగుతున్నాయి. మంగళవారం మధ్యాహ్నం జాదవ్ రావ్ సాబ్ వేసిన జొన్న చేనును పండిత్‌రావు కొడుకు బాలాజీరావ్ కోస్తుండగా రావ్ సాబ్ భార్య జాదవ్ లక్ష్మీబాయి(45) అడ్డుకున్నది. భూమి తమదంటే తమదని ఇరుకుటుంబాల వారు వాగ్వాదానికి దిగారు. మాటామాటా పెరగడంతో బాలాజీరావ్.. లక్ష్మీబాయి మెడపై గొడ్డలితో నరకడంతో అక్కడికక్కడే మృతి చెందింది. దాడిలో లక్ష్మీబాయి చిన్న కొడుకు శుభంరావు కాలు, చెయి విరగడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.